# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు పగటి పూట 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.
- మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కలిపించాలన్నది ఎన్డీయే కూటమి ప్రభుత్వ సంకల్పమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా 82 ఎంఎస్ఎంఈ పార్కులు నిర్మాణ దశల్లో ఉన్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు.

========================

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జెడ్ చింతువలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థకు చెందిన రెండు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ... అభివృద్ధి సూచికల్లో విద్యుత్ వినియోగం కూడా ఓ భాగమని.. ఎంత విద్యుత్ వినియోగిస్తే అంత అభివృద్ధి సాధించినట్లవుతుందన్నారు. అందుకే రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, రాంబిల్లిలో ఏర్పాటవుతున్న ఈ సంస్థ ద్వారా సౌర ఫలకాలు తయారవుతాయని చెప్పారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

4 వేల 200 కోట్ల రూపాయలతో 6.5 గిగావాట్ల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, 1,200 కోట్ల రూపాయలతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టులను రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఏర్పాటు చేయనుంది.

========================

ఎంఎస్ఎంఈల బలోపేతానికి ఉద్దేశించిన ర్యాంప్ కార్యక్రమం అమలు తీరును సమీక్షించేందుకు వరల్డ్ బ్యాంక్ ప్రతినిధుల బృందం, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులు రాష్ట్రంలో పర్యటించారు. అందులో భాగంగా మంగళగిరిలోని ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ. డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో ఈరోజు సమావేశమై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ర్యాంప్ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి ఆ బృందాలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన `వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రైజ్` ప్రోగ్రామ్, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు కావల్సిన చర్యలను తీసుకుంటున్నామని మంత్రి తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 19 ఎంఎస్ఎంఈ పార్కులు అందుబాటులోకి రాగా... మరో 82 పార్కులు నిర్మాణ దశల్లో ఉన్నాయని, అవి కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు.

========================

మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కలిపించాలానేది ఎన్డీయే కూటమి ప్రభుత్వ సంకల్పమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. విజయవాడలో ఆయన ఈరోజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. అందరితో చర్చించిన పిదప మెజారిటీ ఆధారంగానే 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుని ప్రవేశపెట్టామన్నారు. 33 శాతం అమలు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఆచరణలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పార్లమెంట్‌లో ఈ బిల్లుని ప్రవేశపెట్టిందని, అయితే విపక్షాలు మహిళా రిజర్వేషన్ బిల్లుని రకరకాల కారణాలతో వీగిపోయేలా చేసిందని చెప్పారు. తాత్కాలికంగా ఓడించవచ్చేమో కానీ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఈ బిల్లును తప్పకుండా ముందుకి తీసుకెళ్తామన్నారు. 2034 ఎన్నికల వరకు ఆగకుండా 2029 ఎన్నికల్లోపే ఈ బిల్లుని అమలు చేయడం కోసం డీలిమిటేషన్ చేసి మహిళలకి చట్టసభల్లో న్యాయం చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

========================

నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పిఎం శ్రీ పథకం ద్వారా నూతనంగా నిర్మించిన లైబ్రరీ, అదనపు తరగతి గదుల భవనాలను రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని.. వారికి సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అందించేందుకు ఈ నూతన భవనాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

విరామం

========================

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తిరుపతిలోని ఎపిఎస్పిడిసిఎల్ కార్యాలయంలో 18 మందికి కారుణ్య నియామక పత్రాలను మంత్రి ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీసీ వినియోగదారులకు సంబంధించిన పీఎం సూర్యఘర్ టెండర్ల ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలను అధ్యయనం చేసి.. సరఫరాలో నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు పగటి పూటే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని, దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

విద్యతో పాటు జీవితంలో విలువలు, సంస్కారం ఎంతో ప్రధానమని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. విశాఖ నగరంలోని బీచ్‌రోడ్డు ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరుగుతున్న ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా న్యాయ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాంకేతికత అభివృద్ధి చెందినా మానవీయ స్పర్శ మరువరాదని, పేదల పక్షాన నిలిచే ప్రయత్నం యువ న్యాయవాదులు చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, వీటిని నిరోధించడం, ప్రకృతి పర్యావరణ పరిక్షణకు బాసటగా నిలవాలన్నారు. న్యాయవాదులకు సమాజంతో నేరుగా సంబంధం కలిగి ఉంటుందన్నారు. జ్ఞాన సముపార్జన, సేవా నిరతి కలిగి ఉండాలని సూచించారు. భారతీయ ధర్మాన్ని గుర్తు చేసుకోవడం, సత్యం వైపు నిలవడం ఎంతో ప్రధానమన్నారు. ఆధునిక సాంకేతికతను యువత అందిపుచ్చుకోవాలని, అదే సమయంలో అంతర్జాతీయ న్యాయ పరిణామాలను తెలుసుకోవాలన్నారు.

========================

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పలు ప్రధాన పథకాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (CBC) టెండర్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ఈవెంట్ మేనేజ్ మెంట్ సంస్థల నుంచి కొటేషన్లను మే నెల 5వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్టు సీబీసీ డైరెక్టర్ జి. సురేష్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపానెల్ మెంట్ ద్వారా ఎంపికైన సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రచార కార్యక్రమాలు, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహించవలసి ఉంటుందని ఆయన తెలియజేశారు. కనిష్ఠ ధర పలికిన సంస్థకు ఇచ్చే 60 శాతం పనులు పోను, టెండరు ప్రక్రియలో విజయవంతంగా పాల్గొన్న సంస్థలన్నింటికీ మిగిలిన పనిని సమానంగా చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. సంస్థల పనితీరును బట్టి, పరస్పర అంగీకారంపై ఎంపానెల్ మెంట్ మరో ఏడాది పొడిగించే అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. ఈనెల 30వ తేదీన ప్రీబిడ్ సమావేశం నిర్వహించి టెండర్ ప్రక్రియలో పాల్గొనే సంస్థలకు ఆయా కార్యక్రమాల వివరాలు, సంస్థల బాధ్యతలను వివరిస్తామని జి. సురేష్ కుమార్ వెల్లడించారు.

========================

అర్హులైన ప్రతి ఒక్కరికి “వీబీ జీ రామ్ జీ” పథకం కింద ఉపాధి హామీ పనిదినాలు కల్పించాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. భీమవరం నుంచి దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా ఈ పథకంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో ఉపాధి హామీ పనిదినాల కల్పనలో గణనీయమైన లోటు కనిపిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో రోజుకు సుమారు 44 వేల పనిదినాలు కల్పించాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 14 వేల 196 మందికి దాదాపు 23 వేల పనిదినాలు మాత్రమే కల్పించడం జరిగిందన్నారు. ప్రతి పంచాయతీలో కనీసం 2 వేల మంది కార్మికులకు రోజువారీగా పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. కాలువలు, ఫీడర్ చానల్స్ పూడికతీత, డ్రైనేజీ పనులు వంటి అభివృద్ధి పనులను గుర్తించి పెద్ద ఎత్తున పనులు చేపట్టాలన్నారు.

========================
========================